# ఆత్మాహుతి



తిరుమలశ్రీ

బాలభానుడి నులివెచ్చని కిరణాల తాకిడికి మెల్లగా కన్నులు తెరిచాను. నేను ఈ జగతిలో ఉదయించి ఎంతోసేపు కాలేదు.

భాస్కరుడి ఉషకిరణాలు అంతటా వ్యాపించి, ప్రకృతిని ఉత్తేజపరుస్తూంటే... శీతల పవనాలు మేనులను సేదదీరుస్తూంటే... మధురిమలు నిండిన పక్షి కూజితాలు వీనులు విందుకావిస్తూంటే... ఆ శీతాకాలపు ఉదయం ఎంతో హాయిగా, పరవశనీయంగా వుంది.

ఆనందోత్సాహాలతో పరిసరాలను పరికించాను. రకరకాల పూలమొక్కలతో, రంగురంగుల పూలతో అత్యంత సుందరంగా వుంది ఆ వనం. వివిధ జాతులకు చెందిన సుమాలు ఆ వనాన్ని అలంకరిస్తున్నాయి, అలరిస్తున్నాయి.

నల్లగా నిగనిగలాడుతూ, శరీరధారుఢ్యం ఆపాదించిన పొగరుతో... పరువంలోవున్న పూబోణులను పరామర్శిస్తూ, వాటికి రసికత్వాన్ని రుచిచూపిస్తూన్న గండుతుమ్మెదల వంక సంభ్రమంతో కన్నులు విప్పార్చుకుని చూసాను. ఆకర్షణీయమైన పంచవర్ణాల దుస్తులతో వనమంతా తమదేనన్నట్టుగా విహరిస్తున్న అత్యంత సుందరమైన సీతాకోకచిలుకలు... వాటిని అందుకోవడానికి ప్రయత్నిస్తున్నాయా అన్నట్టు అంతటా గెంతుతున్న పచ్చటి మిడతలూ... భూమిలోంచి వెలుపలికి వచ్చి సూర్యకిరణాల వెచ్చదనాన్ని వొంటికి దట్టించుకున్న వానపాములు... కనులపండువగా వుంది. అన్ని అందాలను, విశేషాలనూ ఇముడ్చుకున్న ఆ ప్రకృతి ఎంతో అద్భుతంగా తోచింది నాకు. అంతటి ఆహ్లాదకరమైన ప్రకృతిమాత ఒడిలో నేనూ ఓ బిడ్డనైనందుకు ఎంతో ఉత్సాహంగా, కొంచెం గర్వంగా అనిపించింది.

"చామూ!" చుట్టూ నెలకొన్న ఆ రమణీయ ప్రకృతిని నేను మైమరచి ఆస్వాదిస్తూంటే మమ్మీ పిలుపు వినిపించింది.

'చామంతి' జాతి చిన్నారిని నేను. మమ్మీ ముద్దుగా 'చామూ' అని పిలుస్తుంది నన్ను. చుట్టూ - రకరకాల ఛాయలతో, వివిధ ఆకృతులలో, వివిధ వయసులలో వున్న నా జాతి వారిని గుంపులుగా చూస్తుంటే ఆనందంగా వుంది నాకు.

"చామూ!" మమ్మీ మళ్లీ పిలవడంతో, నా చూపుల్ని తనవైపు మళ్లించాను. మమ్మీ నా కంటికి అత్యంత సుందరంగా కనిపించింది - ఆ వనంలోని అందరికంటే, అన్నింటికంటేను!

"ఏం చూస్తున్నావు చిట్టితల్లీ?" మందహాసంతో అడిగింది మమ్మీ.

"ఈ ప్రకృతి చాలా చాలా అందంగా వుంది మమ్మీ!" అత్యుత్సుకతతో చెప్పాను. "క్రిందికి ఉరికి ఆ పచ్చగడ్డి తెన్నె మీద తనివితీరా దొర్లాలని ఉంది నాకు. ఆ రమణీయ సీతాకోకచిలుకలతో కలిసి వనమంతా విహరించాలని వుంది. పచ్చటి మిడతలతో పాటు వెచ్చటి కిరణాలతో దుముకుడు ఆట ఆడాలని వుంది".

ప్రేమగా నా బుగ్గలు పుణికింది మమ్మీ. "మనకంటూ కొన్ని హద్దులు వున్నాయి బేబి! భగవంతుణ్ణి, మానవుణ్ణీ అలంకరించడానికి, అలరించడానికీ పుట్టాం మనం. అలా విచ్చలవిడిగా సంచరించే అదృష్టం మనకు లేదమ్మా" అంది మృదువుగా.

మమ్మీ పలుకులు నా కనులను వెడల్పుచేసాయి ఆశ్చర్యంతో. ఉదయం సమీపం నుంచి వినవచ్చిన గంటలు... అవి దేవుడి గుళ్లోంచి వచ్చాయని మమ్మీ చెప్పడమూ హఠాత్తుగా గుర్తుకువచ్చాయి.

"గంటగంటకూ నువ్వు వయస్సు పోసుకుంటున్నావు చిట్టితల్లీ!" మళ్లీ అంది మమ్మీ.

"వయసు రాగానే ఆ గుళ్లోని దేవుడి మెడలోకి నేను చేరతానా మమ్మీ?" అమాయకంగా అడిగాను.

మమ్మీ చిన్నగా నిట్టూర్చింది. "చెప్పలేమమ్మా. నిన్ను నువ్వు తాజాగా ఆ దేవుడికి సమర్పించుకోవాలనుకున్నా, పోకిరీ తుమ్మెదలు నీ పవిత్రతను చెడగొట్టాలని చూస్తాయి. అంతే కాదు... గాలి విషయంలో కూడా జాగ్రత్తగా వుండాలి. ఏమాత్రం ఏమరుపాటుగా వున్నా గాలి తాకిడికి రాలి, క్రింద వున్న మురికి కుంటలో పడి వయసు చెల్లకుండానే ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది" హెచ్చరించింది మమ్మీ.

క్రిందికి తొంగిచూసాను. పెద్ద మురికి కాలువ ఒకటి బాగా లోతులో పారుతోంది. నాగుండె ఝల్లుమంది. అంతవరకూ దాన్ని చూడనేలేదు నేను.

"అన్నట్లు బేబీ... నీ అక్కయ్యలు కొందరు ఈ రోజు మనకు దూరంకాబోతున్నారమ్మా!" అంది మమ్మీ మళ్లీ.

"ఎందుకు మమ్మీ? ఎక్కడికి వెళుతున్నారు వాళ్లు?" నా గొంతులో కుతూహలం తొంగిచూసింది. మళ్లీ నిట్టూర్చింది మమ్మీ. "వారి గమ్యం వారి కర్మఫలంతో ముడిపడివుంటుంది" అంది.

నాకేమీ అర్థంకాలేదు. నాముఖకవళికలు గమనించిన మమ్మీ వివరించింది – మన పుట్టుక పరులసేవ కోసమేనమ్మా. ఆ మాటకొస్తే భగవంతుడి సృష్టిలో అందరూ అంతే! అయితే నువ్వు ఎవర్ని సేవించాలన్నది నీ అదృష్టంపై ఆధారపడి వుంటుంది".

ఆసక్తితో చెవులురిక్కించాను.

"మనవి అత్యంత అల్ప జీవితాలు. మానవుడు మనల్ని ఎన్నో రకాలుగా ఉపయోగించుకుంటాడు..." మమ్మీ చెప్పుకుపోయింది. "మనల్ని భక్తితో భగవంతుడికి అర్పించవచ్చును. లేదా రక్తితో తమ స్త్రీల జడలలో ముడవ వచ్చును. అయితే ఎలాంటి స్త్రీ తలకు అలంకరిస్తున్నారన్నది కూడా ఆలోచింపదగ్గ విషయమే. అంతే కాదు, మనల్ని శవాలంకరణలో సైతం ఉపయోగించడం జరగవచ్చు..."

మమ్మీ చివరి పలుకులు నా శరీరాన్ని గగుర్పొడిపించాయి. "అయితే బేబీ, సేవ సేవే! నీ సేవలో నిజాయితీ వున్నప్పుడు, నిన్ను నువ్వు పవిత్రమైన మనస్సుతో అర్పించుకున్నప్పుడు – ఎవరి సేవకు అంకితమవుతున్నావన్నది అనవసర ప్రశ్న!"

మమ్మీ చెబుతూంటే నేను శ్రద్ధగా ఆలకిస్తున్నాను, ఆమె పలుకులు అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తూ. ఆ తరువాత మమ్మీ నా కెన్నో కొత్త విషయాలు చెప్పింది. ప్రకృతి గురించి, ప్రకృతిలోని జీవుల గురించి, మనుషుల గురించి, వారి నైజాలను గురించీ ఎన్నో ఆసక్తికరమైన విషయాలు చెబుతూంటే కుతూహలంతో ఆలకించాను.

అదిగో... అప్పుడే–ఆరంభమయింది హఠాత్తుగా ప్రకృతిలో కంపన! వాతావరణంలో పెను మార్పు వచ్చింది. చిరుగాలి మొదలై క్షణంలో విజృంభించింది–ఆ వనాన్ని గొప్ప క్షోభకు గురిచేస్తూ. చూస్తూండగానే గాలికి పెద్ద వర్షం కూడా తోడయింది. మొక్కలు, వృక్షాలు, పక్షులూ భయాందోళనతో అల్లాడిపోయాయి అంతవరకూ ఎంతో ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా వున్న ప్రకృతి భీభత్సానికి గురయింది.

వర్షంలో తడవడం నాకు సరదాగానేవున్నా,

గాలితాకిడి తట్టుకోవడం కష్టంగా వుంది. నేను క్రిందవున్న మురికి కాలువలో పడిపోయి చచ్చి పోతానేమోనని భయం వేసింది.

భయంతో అరిచాను – "మమ్మీ! రాలిపోయే టట్టున్నాను. ప్లీజ్! నన్ను కాపాడు... ఐ లవ్ యూ మమ్మీ!"

మమ్మీ అనునయంగా నన్ను దగ్గరకు తీసుకోవడానికి ప్రయత్నించింది.

"నన్ను గట్టిగా పట్టుకో మమ్మీ! నిన్ను విడిచి పోవాలని లేదు నాకు, జీవించాలనివుంది... నా పూర్తి జీవితం" బ్రతిమాలాను.

ఆ ఉధృతానికి... మమ్మీ – ఓ పెద్ద చామంతిమొక్క – సైతం ప్రమాదంలో వుందన్న సంగతి నాకు తెలుస్తూనే వుంది. అయినా తాను ఏ మాత్రం ధైర్యం కోల్పోయినట్టు కన్పించడంలేదు. వదనంలో ఎటువంటి ఆందోళన గోచరింపనీయడంలేదు. పై పెచ్చు తన సంతానాన్ని సమాయత్త పరచుకుని వారికి ధైర్యం నూరిపోస్తోంది.

కొంతసేపటికి ఆ ప్రళయం ఆగిపోయింది. ఆ కాస్త సమయంలో సంభవించిన ఉత్పాదానికి యావత్ ప్రకృతీ నాశనమైపోయినట్టు అనిపించింది. వనమంతటా భీభత్సం జరిగింది. ఆ ధాటికి తట్టుకోలేని ఎన్నో మొక్కలు నేలకు వాలిపోయాయి. ఎన్నోపూలు రాలి, మృత్యువు వాడిలో వొరిగిపోయాయి. నా బంధువర్గంలో సైతం ఎందరో అసువులు బాసారు. మమ్మీ వదనం విచారంతో వాడిపోయింది.

నేనెలాగో నిలద్రొక్కుకుని మనగలిగాను. భయాందోళనలు ముప్పిరిగొనడంతో మమ్మీని గట్టిగా పట్టుకున్నాను. భయంలేదన్నట్టు ప్రేమాదరాలతో నా వెన్ను నిమిరింది మమ్మీ.

కాసేపటికి నా భయం తగ్గి మనసు నెమ్మదించింది. ప్రకృతి మళ్లీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకునేందుకు ప్రయత్నిస్తోంది.

అంతలో కొందరు మనుషులు బుట్టలు పట్టుకుని వనంలో ప్రవేశించడం కనిపించింది. వయసొచ్చిన పూలను ఒక్కొక్కటే కోయసాగారు వాళ్లు. వాటిని వివిధ బుట్టలలో వేయసాగారు. కొన్ని దేవుడికి, మరికొన్ని మిగతా ఉపయోగాల కని మమ్మీ చెప్పింది.

నాకు కుతూహలంగానూ, విచారంగానూ కూడా అనిపించింది. నా విచారానికి కారణం – నా అక్కయ్యలు కొందరు మా నుంచి వేరు కావడమే. మమ్మీ ముఖంలోకి చూసాను జాలిగా. తాను దుఃఖిస్తున్నా ఆ ఛాయలేవి పైకి కనిపించడంలేదు. మమ్మీ కళ్లలోని విషాదపు చారలు మాత్రం నా దృష్టిని తప్పించుకోలేకపోయాయి.

హఠాత్తుగా స్ఫురించింది నాకు – నా భవిష్యత్తేమిటి? ఏదో ఓ రోజున నేను కూడా నా ప్రియతమ మమ్మీని విడిచి వెళ్లిపోకతప్పదు!

ఆ ఆలోచనే నన్ను గొప్ప ఆందోళనకు గురిచేసింది. మమ్మీని గట్టిగా కావలించుకున్నాను. "మమ్మీ! ఐ లవ్ యూ మమ్మీ! నిన్ను విడిచి వెళ్లను నేను" అన్నాను.

నా మనసు అర్థంచేసుకున్నట్టు, నా భావోద్వేగాలను గుర్తించినట్లు మమ్మీ నన్ను ప్రేమతో గాఢంగా తన గుండెలకు హత్తుకుని అనురాగంతో నాతల నిమిరింది. నా వంతు అప్పుడే రాదని ధైర్యం చెప్పింది. అయితే కాలం ఎవరి కోసమూ ఆగదట! కాలం అనుభూతులకు అతీతం కూడానట! ఎరిగున్న భవిష్యత్తుకు మానసికంగా సిద్ధంకావాలే గానీ, భయాలతో కృంగిపోకూడదట. అందువల్ల జీవితంలోని మాధుర్యాన్ని అనుభవించలేమట!

మర్నాడు మళ్లీ మనుషులు వేళకాని వేళలో తోటలో ప్రవేశించారు పూలుకోయడానికి. వారిని చూసి నేను భయపడుతూంటే మమ్మీ నా వెన్ను తట్టింది. నేనింకా పసిదానినేనని, నా వంతు ఇంకా రాదని హామీ ఇచ్చింది. దాంతో నా గుండెలు కాస్త కుదుటపడ్డాయి.

తుంటరి తుమ్మెద ఒకటి వార్త మోసుకొచ్చింది - ప్రముఖ రాజకీయ నాయకుడు ఎవరో ఆ ఊరికి వస్తున్నాడట. అతన్ని స్వాగతించే నిమిత్తం నిలువెత్తు పూదండ ఒకటి తయారుచేస్తారట.

"పాపం... వీళ్లెవరికీ దేవుడి కంఠసీమను అలరించే భాగ్యం లేదు కదూ మమ్మీ?" అన్నాను నేను కించిత్తు జాలిగా. "పైపెచ్చు రాజకీయ నాయకుడి పరంకావడం దురదృష్టకరం కదూ?"

నా వంక అదోలా చూసింది మమ్మీ... పరుల సేవకోసమే పుట్టాం మనం. భగవంతుణ్ణి చేరే అదృష్టం చేజారిపోయాక - ఎవర్ని సేవిస్తున్నామన్న సంగతి అనవసరం. అది ఇల్లాలైనా సరే... లేదా మనలాగే పరుల సేవలో కర్పూరంలా కరిగిపోయే వెలయాలైనా సరే! 'మానవసేవే మాధవసేవ!...' అంటూ వేదాంత ధోరణిలో సాగించింది.

అంతలో మా వైపు వచ్చిన ఓ వ్యక్తి దృష్టిలో పడ్డట్టున్నాను నేను. 'ఈ చిట్టి చామంతిని చూడరా, ఎంత ముద్దుగా వుందో!' అన్నాడు ప్రక్కవాడితో, నావంకే అబ్బురంగా చూస్తూ. ఉలిక్కి పడ్డాను నేను.

రెండోవాడు కూడా నా వంక చూసి, 'ఔను, ఎంచక్కా వుంది' అన్నాడు. 'దీన్ని కోసి గులాబీల మధ్య గుచ్చితే... ఎంత అందంగా వుంటుందో!' అని మొదటి వాడంటే, 'నిజమే దాన్ని కోద్దాం' అంటూ వత్తాసు పలికాడు రెండోవాడు.

వారి సంభాషణ నా గుండెల్ని గుభేలుమనిపించింది. భయంగా మమ్మీ వంక చూసాను.

వారి పలుకులు మమ్మీ కూడా ఆలకించినట్లుంది. ఆమె వదనం వివర్ణమయింది.

"వాళ్లు నిజంగానే నన్ను తీసుకుపోతారా మమ్మీ?" బేలగా అడిగాను.

"ఈ మనుషుల పోకడలను గ్రహించడం కష్టం బేబీ!" అంది మమ్మీ నిట్టూర్పును గొంతులోనే అణచుకుంటూ. ఓదార్పుగా నన్ను అక్కున చేర్చుకుంది.

భయాందోళనలతో నా గొంతుక పెగల్లేదు. వయసుపోసుకోకుండానే, నా వంతు రాకుండానే మమ్మీని, నా వాళ్లనూ విడిచి, నాయకుడి కంఠాన్ని అలంకరించడం నాకు సుతారమూ ఇష్టం లేదు.

రాజకీయ నాయకులు ఎలాంటివాళ్లో అంత క్రితం మమ్మీ నుంచి ఆలకించి వున్నాను నేను. ఇప్పుడొస్తున్న నాయకుడు నక్కజిత్తుల కుయుక్తుల కుసంస్కారి. ప్రజాసేవ పేరిట ప్రజలను దోచుకునే స్వార్థపరుడు, నయవంచకుడు, నీతిమాలిన వ్యక్తి. సమాజానికి చీడపురుగులాంటి వాడు. రాజకీయ నాయకులలో అధికశాతం అలాంటి వాళ్లేనంది మమ్మీ.

అటువంటి కుటిలుడిని సేవించడం ప్రజాద్రోహమవుతుందని అనిపించింది నాకు. ఆ రాజకీయ నాయకుడి గళాన్ని అలంకరించబోవడం విపరీతమైన దిగులుకు గురిచేసింది... ఆ రాజకీయ నాయకుడంటే నాదృష్టిలో ఓ అంటరాని వాడితో సమానం. అలాంటి వాడి కంఠానికి అలంకారం కావడం నాకు సుతారమూ ఇష్టంలేదు. అది నా పరువును, మర్యాదను, ఆత్మగౌరవాన్నీ భంగపరిచే విషయం.

అంతకంటే ఓ శవాన్ని అలంకరించడం

నాకు మిక్కిలి సంతోషం కలిగిస్తుంది. అంతేకానీ, ఆ రాజకీయవేత్తను అలంకరించడం మాత్రం కాదు.

ఆ విషమస్థితి నుంచి ఎలా బైటపడాలో బోధపడలేదు నాకు. నా బాధ మమ్మీతో చెప్పుకున్నాను. ఆ దుస్థితి నుంచి నన్నెలాగైనా బైటపడెయ్యమని మొరపెట్టుకున్నాను!

నేను ఆ రాజకీయ నాయకుడికి అర్పణకావడం మమ్మీకి కూడా ఇష్టంలేదు. అలాగని తాను చేయగలిగిందీ ఏమీ లేదు. అదే విషయం చెప్పింది విషణ్ణ వదనంతో. నన్ను చూసి ముచ్చటపడ్డ వ్యక్తి నన్ను సమీపిస్తూంటే నాలో దడ ఆరంభమయింది. ఆందోళన అధికమయింది. ఆత్రుత హెచ్చింది. అతని గోటి కత్తెర నుంచి ఎలా తప్పించుకోవాలో తెలీలేదు. అతని చేయి నా వొంటి మీద పడకముందే ఏదో ఒకటి చెయ్యాలని వుంది. కానీ, ఏం చేయాలో తోచడంలేదు. నేను తక్షణమే ఓ నిర్ణయానికి రాక తప్పదు. అది ఎలాంటిదైనా సరే...

ఆ మనిషి వ్రేళ్లు నన్ను తాకబోతున్నాయి.

అదే క్షణంలో - నా నిర్ణయం ఖరారయింది.

రాజకీయ నాయకుడి కంఠసీమ కంటే - మృత్యువు ఒడి ఎంతో గౌరవప్రదమైనది!

చివరిసారిగా - ప్రేమతో గాఢంగా మమ్మీని ముద్దుపెట్టుకున్నాను. లోకంలో అన్నిటికంటే - నా కంటే కూడా - నేను అమితంగా ప్రేమించింది మమ్మీనే మరి!

మరుక్షణం - ఏదో మత్తులో వున్నదానిలా, మమ్మీ వారించబోతున్నా వినిపించుకోకుండా - నన్ను కోసిన వ్యక్తి వ్రేళ్ల మధ్య నుంచి చటుక్కున జారి, క్రిందవున్న మురికి కాలువలోకి గెంతాను -గౌరవప్రదమైన మృత్యువు కౌగిట్లోకి!!

## రచయితలకు గమనిక

పత్రికలకు కథలు పంపించేటపుడు హామీ పత్రం పంపించడం అనేది సంప్రదాయంగా వస్తోంది. అయితే కొంతమంది రచయితలు తమ రచనలను ఇష్టానుసారం వివిధ పత్రికలకు పంపించి, యదావిధిగా హామీపత్రం వ్రాసి పంపించేస్తున్నారు.

ఇటీవల 'కథాకేళి'కి ఇటువంటి సంఘటనలు అనేకం తటస్థించాయి. 'కథాకేళి'కి పంపించి, ప్రచురణకు ఎంపికై ఉన్న కథలు మరో పత్రికలో ప్రచురించబడడం లేదా 'కథా సంపుటాల'లో ప్రచురించబడడం వంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. ఒక కథ ప్రచురణకు ఎంపికై, రచయితకు తెలియపరిచిన తర్వాత అదే కథను 'దీపావళి కథల పోటీ'కి పంపించడం ఇటువంటి సంఘటనలకు పరాకాష్ఠ.

సమాజానికి ఉన్నత విలువలు, మంచి మార్గాన్ని చూపించవలసిన రచయితలు తామే బాధ్యతారాహిత్యంగా, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం బాధాకరం. ఇటువంటి రచయితలపట్ల కొంత కఠినంగానే వ్యవహరించాలని 'కథాకేళి' భావిస్తోంది. అందుచేత 'కథాకేళి' నియమాలకు విరుద్ధంగా ప్రవర్తించే రచయితల రచనలను కనీసం 6 నెలల పాటు నిషేధించాలని నిర్ణయించడం జరిగింది. భవిష్యత్తులో ఈ వ్యవధిని మరింత పెంచే విషయం, నిషేధం విధించబడిన రచయితల వివరాలను పత్రికలో ప్రచురించే విషయం కూడా పరిశీలించబడుతుంది.

పై విషయాన్ని గమనించి రచయితలు తమ రచనలను పంపించేటపుడు తగు జాగ్రత్తలు తీసుకొని, మాతో సహకరించవలసిందిగా కోరుతున్నాం.

- ఎడిటర్